క్లుప్తంగా

సేవాలాల్ జయంతికి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రేమ లాగార్డెన్ ఆవరణలో ఫిబ్రవరి 22వ తేదీన నిర్వహించే సేవాలాల్ జయంతికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని శ్రీ సంత్ సద్గురు దీక్షా గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్‌కు బుధవారం మహార్‌ఘాట్‌లోని ఆయన నివాసంలో జిల్లా సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు బదావత్ శివప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాథోడ్ రవీందర్, బలరామ్‌నాయక్, ఇందూలాల్‌నాయక్, బానోత్ గోపాల్‌నాయక్‌లు పాల్గొన్నారు.

‘రంగరాజన్‌పై దాడి అమానుషం’



మాట్లాడుతున్న సుజాయత్‌ఖాన్

కెరమెరి: చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి అమానుషమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు ఎండీ సుజాయత్ ఖాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి అదుపుతప్పుతున్న మతోన్మాద సంస్కృతికి నిదర్శనమన్నారు.

బంబార ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని బంబార గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఇద్దరి నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కుష్ఠు, డెంగి, మలేరియా, క్షయ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఏఎన్‌ఎం సునంద, ఆశ సరోజ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూర్ ఎంపీడీవోగా ప్రవీణ్ కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: బెజ్జూర్ నూతన ఎంపీడీవోగా బండారి ప్రవీణ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత నెల రోజుల క్రితం వరంగల్ జిల్లా నుంచి బెజ్జూర్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చిన ఆయనకు ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయనను కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

స్థలం పరిశీలన

కౌటాల: మండలంలోని కనికి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని తహసీల్దార్ పుష్పలత పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కనికి శివారు సర్వే నంబర్ 83, 124లలో స్థలాన్ని పరిశీలించామని, కేవీకే ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం అవసరముందన్నారు. పూర్తి నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఆర్‌ఐ దిలీప్, సిబ్బంది ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

కౌటాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నాయకులతో మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

కొనసాగుతున్న గంగాపూర్ జాతర



దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు



తినుబండారాలు కొనుగోలు చేస్తున్న భక్తులు



జాతరలో కిటకిటలాడుతున్న భక్తులు



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న జాతర రెండోరోజు కొనసాగింది. జాతరకు లక్షలాదిగా భక్తులు తరలివస్తుండటంతో ఆలయానికి వచ్చే మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. జాతరలో ఎంతో ప్రాముఖ్యమైన రథోత్సవం సందర్భంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. కాగా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన వర్తక వ్యాపారులు సహాయంతో జాతరకు తరలివచ్చిన భక్తులకు మహా అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావులు మహా అన్నదానాన్ని ప్రారంభించారు. ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన కనిపించింది. – రెబ్బెన



రంగుల రాట్నం వద్ద సందడి



వంట పాత్రల కొనుగోలులో భక్తులు



రంగురంగుల బొమ్మలను కొనుగోలు చేస్తున్న భక్తులు



బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి సహిత సద్గురు సాయినాథ్ దేవాలయం వద్ద బుధవారం జాతర అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు కమలాకర్ శర్మ, బాచంపల్లి కిషోర్‌శర్మ, పరమేశ్వర్, విఘ్నేశ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవా నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బీబ్రా జాతరలో దుకాణాలు

ఘనంగా రవిదాస్ మహరాజ్ జయంతి



నివాళులర్పిస్తున్న బౌద్ధ సంఘం నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బుధవారం సంత్‌గురు రవిదాస్ మహరాజ్ 648వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన రవిదాస్ మహరాజ్ నీతి నియమాలతో, దైవ భక్తితో మెలిగారని, సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేశారన్నారు. అలాగే అణగారిన కులాల వారికి విద్యా ప్రాముఖ్యతను చాటి చెప్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ మండల అధ్యక్షుడు ఉప్రె జైరాం, జిల్లా ఆర్గనైజర్ ఉప్రె విజయ్, ఎస్‌ఎస్‌డీ ఆసిఫాబాద్ ఇన్‌చార్జి దుర్గం సందీప్, సమతా భారతి ఐక్య వేదిక నాయకుడు డోంగ్రి ప్రవీణ్ కుమార్, బౌద్ధ సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, హంసరాజ్, మహేశ్, పెంటు, రోషన్, అరుణ్, శ్రీనివాస్, బలవంత్ పాల్గొన్నారు.

మొరం తరలించిన ఐదుగురిపై కేసు నమోదు

బెజ్జూర్: బెజ్జూర్ రేంజ్ పరిధిలోని బాపుగూడ అటవీ సమీపంలోని పోడు భూముల్లో జేసీబీ ద్వారా మొరం రవాణా చేసిన ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో మునవీర్ బుధవారం తెలిపారు. కేసు విచారణ కొనసాగుతుందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

మురుగునీటి తిప్పలు



వాంకిడి: మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో మురుగు నీటి వ్యవస్థ అధ్వానంగా మారింది. రెండేళ్ల క్రితం గ్రామ పంచాయతీ నుంచి మురికి నీరు వెళ్లేందుకు కాలనీలో అండర్ పైప్‌లైన్ నిర్మించారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పైప్‌లైన్ తరుచూ నిండిపోయి మురుగు నీరంతా రోడ్డుపై పారుతోంది. దీంతో తీవ్రమైన దుర్గంధం వెదజల్లడంతో పాటు పారిశుద్ధ్యం లోపించి దోమలు వ్యాప్తి పెరుగుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రేపు అభయాంజనేయుడి విగ్రహ వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ శ్రీ అభయాంజనేయస్వామి భారీ విగ్రహ 14వ చతుర్దశ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు హనుమాన్ ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు కలశపూజ, స్వస్తి పుణ్యాహవచనము, నవగ్రహారాధన, ఏకాదశ రుద్రాభిషేకం, స్థాపిత దేవాత హావానం, మన్యు సూక్త హావనం, పూర్ణాహుతి, మంగళ హారతి, మహామంత్రపుష్పం, మహదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. వార్షికోత్సవ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మించాలి

నేరడిగొండ: కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. కుష్ఠు గుర్తింపు ఉద్యమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు మండలంలోని రాజులతండా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కుష్ఠు గుర్తింపు ఉద్యమంలో భాగంగా ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి పరీక్షించడం జరుగుతుందన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో పాటు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ పరీక్షలు

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఐదు సబ్ సెంటర్ కేంద్రాల్లో వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం క్షయ తేమడ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మొత్తం 50 తేమడ పరీక్షలు చేయడం జరిగిందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే రోగులకు ఉచితంగా టీబీ మందులు పంపిణీ చేస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్ దాస్, పీహెచ్‌ఎన్‌వో సుశీల, రవి పాల్గొన్నారు.

ఆసుపత్రిలో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మల్లికార్జున్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ హెచ్చరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారని, కానీ ఆసుపత్రిలో ఉన్న యంత్రాలను ఉపయోగించడానికి కూడా వైద్యులు లేరంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుంకరి పెంటయ్య ఉన్నారు.

వర్క్‌షాప్‌లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో నెలకొన్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యమొగిళి అన్నారు. బుధవారం ఏరియా వర్క్‌షాప్‌ను సందర్శించిన ఏఐటీయూసీ నాయకులు కార్మికులను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను గుర్తింపు సంఘం దృష్టికి తీసుకొచ్చారు. సరిపడా మ్యాన్‌పవర్ లేకపోవడంతో పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. స్పందించిన గుర్తింపు సంఘం నాయకులు వర్క్‌షాప్‌లో నెలకొన్న సమస్యలను డీజీఎం కృష్ణమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి అశోక్, నాయకులు వసీం, సేఫ్టీ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న భక్తులు



లక్ష్మీపూర్ సమ్మక్క -సారలమ్మ గద్దెల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన: సమ్మక్క సారలమ్మ మినీ జాతరలో భాగంగా మండలంలోని లక్ష్మీపూర్ వాగు ఒడ్డున వెలిసిన సమ్మక్క సారలమ్మ దేవతలను బుధవారం భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వనదేవతలకు బంగారం (బెల్లం), ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. లక్ష్మీపూర్ సమ్మక్క సారలమ్మ గద్దెలను పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్ కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, నాయకులు దుర్గారావు, మహిళా నాయకురాలు మన్యం పద్మలు దర్శించుకుని అమ్మవారికి ముడుపులు సమర్పించారు. ఈ సందర్భంగా పూజారి దేవార వినోద్ భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత



పశువుల వాహనంతో ఏఎస్సై పోశెట్టి

వాంకిడి: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని ఖమాన ఎక్స్‌రోడ్ వద్ద బుధవారం పట్టుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా మహారాష్ట్రలోని గడ్చిరోలి నుంచి హైదరాబాద్‌లోని శామీర్‌పేట్ మార్కెట్‌లో విక్రయించేందుకు ఐచర్ వాహనంలో 20 పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మహాగావ్‌కు చెందిన శాదూల్ ఖాన్, షేక్ అజీమ్, డ్రైవర్ ఖోబ్రగడె మన్‌ప్రీత్, కాగజ్‌నగర్‌కు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసి పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి పాల్గొన్నారు.

ఘనంగా ‘టీఈఈ 1104’ వార్షికోత్సవం



పండ్లు పంపిణీ చేస్తున్న శేషారావ్

ఆసిఫాబాద్‌అర్బన్: కార్మికులే నాయకులుగా, ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ 75 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో జెండా ఆవిష్కరించారు. అదే విధంగా జిల్లాలోని రెండు డివిజన్ కార్యాలయాల పరిధిలో 13 సెక్షన్ ఆఫీసుల్లో జెండా ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషారావ్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడం తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇంజనీర్ జీవరత్నం, అకౌంట్స్ అధికారి తుకారాం, వైద్య సిబ్బంది, యూనియన్ నాయకులు రమేశ్, మహేందర్, రాంరెడ్డి, మురళి, సురేందర్, రాజ్‌కుమార్, సుధాకర్, రాజేశం, శ్యాంబాబు, స్థానిక జూనియర్ కళాశాల అకౌంట్స్ అధికారి శ్రీనివాస్‌బాబు, 1104 యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.